క్లుప్తంగా

రేపు దాచేపల్లిలో జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంప్

దాచేపల్లి : జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంప్‌ను ఈ నెల 30వ తేదీన నిర్వహిస్తున్నట్లు నగర పంచాయతీ కమిషనర్ వేల్పూరి సత్యనారాయణ గురువారం తెలిపారు. దాచేపల్లి-1 సచివాలయం వద్ద ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు ఈ క్యాంప్ నిర్వహిస్తున్నామని, అన్ని రకాల వైద్య పరీక్షలు ఉచితంగా నిర్వహించి అవసరమైన వారికి మందులు ఇస్తారని ఆయన వెల్లడించారు.

సాఫ్ట్‌బాల్‌లో సెయింట్ ఆన్స్ విద్యార్థుల ప్రతిభ

క్రోసూరు: స్థానిక సెయింట్ ఆన్స్ పాఠశాల విద్యార్థులు క్రీడా పోటీల్లో తమ ప్రతిభ చాటారు. బాపట్ల విలియం బూత్ జూనియర్ కళాశాలలో జరిగిన అండర్- 17, 14 విభాగంలో పోటీల్లో నలుగురు విద్యార్థులు నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు గురువారం పాఠశాల ప్రిన్స్‌పల్ సిస్టర్ మేరీ రజిత తెలిపారు. జూనియర్ సాఫ్ట్‌బాల్‌లో రీనాసిగ్మ ఫ్లొరెన్స్, దీవెన్, ఆదిత్య, పూజిత ఎంపికయినట్లు తెలిపారు. వారిని అభినందించారు. క్రీడా ఉపాధ్యాయుడు మక్కెన వెంకట్రావు, పాఠశాల ఉపాధ్యాయులు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో పద్మనాభ స్వామి వ్రతం

పెదకూరపాడు: మండలంలోని 75 త్యాళ్లూరు గ్రామంలో అవధూత అయోధ్యస్వామి ఆశ్రమంలో మహిళలు అధిక సంఖ్యలో అనంత పద్మనాభ స్వామి వ్రతం ఆచరించారు. గాయత్రీ మాత ఉపాసకులు అంకమ్మరావు మాస్టారు భక్తులతో వ్రతం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడారు. లోక కల్యాణం కోసం వ్రతం నిర్వహించడం పూర్వ జన్మ సుకృతమన్నారు. ముందుగా గణపతిపూజతో ప్రారంభించి కుంకుమలతో అనంతపద్మనాభ స్వామిరూపం ఏర్పాటు చేశారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు.

రేబిస్ వ్యాధిని నిర్లక్ష్యం చేయవద్దు

క్రోసూరు: రేబిస్ వ్యాధిని నిర్లక్ష్యం చేస్తే ప్రాణాలతో బయట పడటం కష్టమని క్రోసూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు డాక్టర్ రమాదేవి తెలిపారు. ప్రపంచ రేబిస్ వ్యాధి నివారణ దినోత్సవం పురస్కరించుకుని రేబిస్ వ్యాధి పట్ల ఆమె అవగాహన కల్పించారు. కుక్క కరిచిన వెంటనే వేడి నీటితో గాయాన్ని శుభ్రంగా కడగాలన్నారు. టీటీ, కుక్క కాటు ఇంజక్షన్ కచ్చితంగా వైద్యుల నిపుణులను సంప్రదించి, వేయించుకోవాలన్నారు. పీహెచ్‌సీలో ఇంజన్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ శివుడు, అమరజ్యోతి, స్టాఫ్ నర్సులు, అంజమ్మ, ఎల్టీ ప్రభాకర్‌రావు, హెల్త్ అసిస్టెంట్ ప్రాంక్లిన్, శిఖా శ్యాంసన్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సాయినాథుని జన్మదినోత్సవం



అమరావతి: పవిత్ర పుణ్యక్షేత్రం అమరారామంలోని శ్రీషిర్డి సాయి-పర్తిసాయి కపోతేశ్వర ధ్యాన మందిరంలో సాయినాథుని జన్మదిన వేడుకలను గురువారం అత్యంత వైభవంగా నిర్వహించారు. వేకువజామునే బాబాకు సుప్రభాత సేవ, నగర సంకీర్తన, షిర్డి హారతి కార్యక్రమాలను సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు. అభిషేకానికి పవిత్ర కృష్ణా నదీ జలాలను ఊరేగింపుగా మందిరానికి తెచ్చారు. శ్రీ ధ్యానాంజనేయస్వామి వద్ద హనుమాన్‌చాలీసా పారాయణం, భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. షిర్డిహారతి, గ్రామోత్సవం, సంకీర్తన, ఊయల సేవ నిర్వహించారు.

జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు వరం

సత్తెనపల్లి: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేదలకు వరమని, ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు అన్నారు. పట్టణంలోని 25వ వార్డులో గురువారం వైద్య సిబ్బంది ఇంటింటికి ప్రాథమిక వైద్య పరీక్షలు నిర్వహించారు. వలంటీర్లు, ఆశా కార్యకర్తలు ఇంటింటి సర్వే చేశారు. అనంతరం జగనన్న ఆరోగ్య సురక్ష బ్రోచర్‌ను పంపిణీ చేశారు. కార్యక్రమంలో 28వ వార్డు మాజీ కౌన్సిలర్ షేక్ గని, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, వలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

గుర్రం జాషువా ఆశయాలు అనుసరణీయం

మున్సిపల్ వైస్ చైర్మన్‌లు షేక్ జైలాబ్దిన్, కొమ్ము ముక్కంటి



గుర్రం జాషువా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన మున్సిపల్ వైస్ చైర్మన్‌లు షేక్ జైలాబ్దిన్, కొమ్ము ముక్కంటి

పిడుగురాళ్ల: గుర్రం జాషువా ఆశయాలను ముందుకు తీసుకొని పోవాలని మున్సిపల్ వైస్ చైర్మన్‌లు కొమ్ము ముక్కంటి, షేక్ జైలాబ్దిన్‌లు అన్నారు. పట్టణంలోని తెలుగు బాప్టిస్ట్ చర్చి ఫంక్షన్ హాల్‌లో గుర్రం జాషువా జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బడుగు, బలహీన వర్గాలను తన కవితల ద్వారా మేల్కొలిపి వారిలో చైతన్యం తీసుకొని వచ్చారని వారు తెలియజేశారు. అలాంటి ఆయన ఆశయాలను నేటి యువత ముందుకు తీసుకొని పోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకులు కుందుర్తి గురవాచారి, పట్టణ బీసీ కన్వీనర్ కందులూరి శివయ్య, కౌన్సిలర్ అజ్మీర శారద, చల్లగుండ్ల సంతోషరావు, నాగేశ్వరరావు ఉన్నారు.

గుర్రం జాషువా జయంతి వేడుకలు

పిడుగురాళ్ల: గుర్రం జాషువా బడుగు, బలహీన వర్గాల కోసం ఎంతో పరితపించారని వారిలో చైతన్యం తీసుకొని వచ్చి ఎంతో మంది జీవితాల్లో వెలుగులు నింపిన వ్యక్తి గుర్రం జాషువా అని బడుగు, బలహీన వర్గాల ఐక్యవేదిక సభ్యులు అన్నారు. పట్టణంలో బడుగు, బలహీన వర్గాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో గుర్రం జాషువా జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పోలీస్‌స్టేషన్‌లో గుర్రం జాషువా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాషువా ఎంతో మంది కవులకు ఆదర్శంగా నిలిచారని, ఆయనస్ఫూర్తితో ఎంతో మంది బడుగు, బలహీన వర్గాల కోసం కవితలను రాశారని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో దాచేపల్లి కౌన్సిలర్ షరీఫ్, పుల్లారావు యాదవ్, తులబిల్లి సురేష్‌బాబు, సకినాల పేరయ్య, అమరయ్య, కట్టిబోయిన వెంకటేష్, బ్రహ్మం, చెన్నయ్య తదితరులు ఉన్నారు.

యూటీఎఫ్ స్వర్ణోత్సవ వేడుకలను విజయవంతం చేయండి

యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు నక్కా వెంకటేశ్వర్లు



పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న యూటిఎఫ్ నాయకులు

పిడుగురాళ్ల: యూటీఎఫ్ స్వర్ణోత్సవ వేడుకలను విజయవంతం చేయాలని యూటీఎఫ్ నాయకులు రాష్ట్ర అధ్యక్షులు నక్కా వెంకటేశ్వర్లు అన్నారు. పట్టణంలో స్వర్ణోత్సవ వేడుకలను విజయవంతం చేయాలని గురువారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించటంలో యూటీఎఫ్ ఎప్పుడూ ముందుంటుందని ఆయన తెలియజేశారు. యూటీఎఫ్ స్థాపించి 50 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా ర్యాలీ నిర్వహించి విజయోత్సవ వేడుకలను నిర్వహిస్తున్నామన్నారు. అక్టోబర్ 1వ తేదీన విజయవాడలోని సిద్ధార్థ కాలేజీలో నిర్వహించనున్న స్వర్ణోత్సవ వేడుకల్లో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ ర్యాలీ రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతుందని, అనంతరం విజయోత్సవ కార్యక్రమం చేపడతామని తెలిపారు. యూటీఎఫ్ నాయకులు, కార్యకర్తలు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు. ముందుగా పట్టణంలో యూటీఎఫ్ పతాక ఆవిష్కరణ సీనియర్ నాయకులు ఎం.నాగయ్య చేతుల మీదుగా జరిగింది. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు కొమ్మోజి శ్రీనివాసరావు, పల్నాడు జిల్లా అధ్యక్షులు పి.ప్రేమ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి జి.విజయసారథి, కార్యవర్గ సభ్యులు ఎస్‌కే జమాల్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కె.కాశీం పీరా, మాచవరం, దుర్గి, కారెంపూడి, దాచేపల్లి, గురజాల, రెంటచింతల మండలాల యూటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కు అందజేత

వినుకొండ (నూజెండ్ల): పేద బడుగు బలహీన వర్గాల ఆదుకునేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సీఎం సహాయ నిధి ద్వారా అందిస్తున్న పరిహారాన్ని అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఉప్పలపాడు గ్రామానికి చెందిన కొత్త తేజస్వినికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ. 3 లక్షల 80 వేల చెక్కును అందజేశారు. మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

ఉపాధి హామీలో సామాజిక తనిఖీలు

- సత్తెనపల్లి క్లస్టర్ వ్యాప్తంగా 14,143 పనులు
- రూ.88.38 కోట్ల మేర ఉపాధి నిధులు ఖర్చు
- ఈ నెలాఖరు నుంచి గ్రామాల్లోకి సామాజిక తనిఖీ బృందాలు



ధూళ్ళిపాళ్లలో పొలాలకు వెళ్లే మట్టి రోడ్డు పనులు చేస్తున్న ఉపాధి హామీ కూలీలు

సత్తెనపల్లి: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా సత్తెనపల్లి క్లస్టర్ పరిధిలోని సత్తెనపల్లి, ముప్పాళ్ళ, రాజుపాలెం, నకరికల్లు, పెదకూరపాడు, అమరావతి, అచ్చంపేట, క్రోసూరు, బెల్లం కొండ మండలాల గ్రామాలలో చేపట్టిన పనులపై క్షేత్రస్థాయిలో సామాజిక తనిఖీలు చేపట్టనున్నారు. గతేడాది ఏప్రిల్ 1 నుంచి ఈ ఏడాది మార్చి 31వ తేదీ వరకు చేసిన పనులపై సామాజిక తనిఖీ బృందాల పరిశీలన చేయనున్నారు. పనులకు సంబంధించిన వర్క్ ఆర్డర్, ఎం బుక్కులు, పే ఆర్డర్లు, మస్టర్లు, మెటీరియల్ ఓచర్లను ఉపాధి సిబ్బంది సిద్ధం చేశారు. వీటిని ఆయా గ్రామాల్లో తనిఖీలకు వెళ్లే బృందాలకు అందజేయనున్నారు.

క్లస్టర్‌లో 14,130 పనులు

సత్తెనపల్లి క్లస్టర్‌లోని గ్రామాల్లో ఉపాధి హామీ పథకం కింద 14,130 పనులు చేపట్టారు. క్లస్టర్ వ్యాప్తంగా తొమ్మిది మండలాల్లో 75,415 జాబ్ కార్డులు ఉన్నాయి. ఇందులో 57,949 కుటుంబాల వారు ఉపాధి పనుల్లో పాల్గొంటున్నారు. ఉపాధి హామీ పనుల్లో 1,01,691 మంది కూలీలు పనులు చేపట్టారు. ఉపాధి హామీ పథకం ద్వారా చెరువులు పూడికతీత, పంట కాలువలు, పొలాలకు వెళ్లే డొంక రోడ్లు, మొక్కల, తోటల పెంపకం తదితర పనులు చేపట్టారు. ఈ పనులపై సామాజిక తనిఖీ బృందాలు తనిఖీ నిర్వహించి, నివేదికలు తయారు చేయనున్నాయి.

రూ.88.38 కోట్ల మేర ఉపాధి నిధులు ఖర్చు..

సత్తెనపల్లి క్లస్టర్ వ్యాప్తంగా 9 మండలాల్లోని గ్రామాల్లో ఉపాధిహామీ పథకం ద్వారా పనులు చేపట్టి రూ. 88.38 కోట్ల మేర ఉపాధి నిధులు ఖర్చు చేశారు. ఇందులో కూలీలకు రూ. 49.29 కోట్లు , మెటీరియలకు రూ. 30.09 కోట్ల మేర నిధులు ఖర్చు చేశారు. ఈ నిధులను ఏయే పనులకు ఎంత ఖర్చు చేశారన్న రికార్డులను పరిశీలించి తనిఖీలు చేస్తారు. పని కావాలన్న ప్రతి ఒక్కరికీ ఉపాధి హామీ ద్వారా గ్రామాల్లో పనులు కల్పించారు. ఈ పనులపై ఈ నెలాఖరు నుంచి తొలుత రాజుపాలెం, పెదకూరపాడు మండలాల నుంచి సామాజిక తనిఖీ బృందాలు గ్రామాలకు వెళ్లి రికార్డుల ఆధారంగా పనులను పరిశీలించనున్నారు. ఇందుకు సంబంధించిన అన్ని రికార్డులను తనిఖీ బృందాలకు అందజేసినట్లు అధికారులు తెలిపారు.

సామాజిక వ్యవస్థ కోసం పాటుపడిన లక్ష్మారెడ్డి



పోస్టరును విడుదల చేస్తున్న నాయకులు

నరసరావుపేట: జీవితాంతం సామాజిక వ్యవస్థ కోసం పరితపించిన వ్యక్తి ఎస్.లక్ష్మారెడ్డి అంటూ ప్రజాసంఘాల నాయకులు కొనియాడారు. ఈనెల 30వ తేదీన గుంటూరులోని గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రంలో నిర్వహించే పౌరహక్కుల సంఘ నాయకుడు లక్ష్మారెడ్డి సంస్మరణ సభను ఉద్దేశించిన గోడపత్రికను గురువారం మార్కెట్ యార్డు ఆవరణలో ఆవిష్కరించారు. రాష్ట్ర పీడీఎం నాయకులు వై.వి.వెంకటేశ్వర్లు, పౌర హక్కుల సంఘం ఉమ్మడి జిల్లా సంయుక్త కార్యదర్శి శికినం చిన్న మాట్లాడుతూ హక్కుల సంఘం అంటేనే సాహసిక ప్రయాణమన్నారు. ఆ స్ఫూర్తిని అలవర్చుకొని కొనసాగించాల్సిన బాధ్యత అందరిపైన ఉందన్నారు. తాను నమ్మిన ఆచరించిన విశ్వాసాలను అనుగుణంగా దేశవ్యాప్తంగా అప్రకటిత ఎమర్జెన్సీని తలపిస్తున్న ఎన్ఐఏ అక్రమ అరెస్టులు, ఆదివాసులపై దాడులు, చట్టబద్ధపాలనపై బీజేపీ భావజాలాన్ని ప్రతిబింబించే మణిపూర్ సంఘటనలపై సీఎల్సీ నిజ నిర్ధారణ రిపోర్టుపై దేశవ్యాప్తంగా చర్చ జరుగుతున్న సనాతన ధర్మంపై అవగాహన కల్పించేందుకు ఈ సదస్సును ఏర్పాటు చేస్తున్నామన్నారు. జై భీమ్ భారత్ పార్టీ జిల్లా అధ్యక్షులు గోదా జాన్‌పాల్, ఎంబిఎం పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్ దర్యావలి, పీడీఎం జిల్లా నాయకులు రామకృష్ణ, పుల్లారెడ్డి పాల్గొన్నారు.

ఖోఖో పోటీలకు కృష్ణవేణి విద్యార్థిని

నరసరావుపేట ఈస్ట్: జాతీయస్థాయి మహిళా ఖోఖో పోటీలకు కృష్ణవేణి డిగ్రీ కళాశాల విద్యార్థిని బి.అలేఖ్య ఎంపికైనట్టు కళాశాల ప్రిన్సిపల్ నాతాని వెంకటేశ్వర్లు గురువారం తెలిపారు. కాకినాడ జేఎన్‌టీయూలో ఈనెల 27న ఖేలో ఇండియా రాష్ట్ర మహిళా ఖోఖో జ ట్టు ఎంపిక పోటీలలో తమ విద్యార్థిని అలేఖ్య అండర్-18 విభాగం జట్టుకు ఎంపికైనట్టు వివరించారు. తమిళనాడు రాష్ట్రం కృష్ణగిరిలోని సె యింట్ జాన్‌బాస్కో బాలికల ఉన్నత పాఠశాలలో అక్టోబరు 6వ తేదీ నుంచి 8వతేదీ వరకు జరగనున్న ఖేలో ఇండియా సౌత్‌జోన్ మహిళా ఖోఖో పోటీలలో అలేఖ్య ఆంధ్రప్రదేశ్ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తుందని తెలిపారు.

స్విమ్మింగ్ పోటీలకు ఎస్ఎస్ అండ్ ఎన్ విద్యార్థి

నరసరావుపేట ఈస్ట్: శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల విద్యార్థి ఎస్. జగదీష్ 37వ జాతీయ క్రీడలకు ఎంపికైనట్టు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సోము మల్లయ్య, వ్యాయామ అధ్యాపకుడు డాక్టర్ యక్కల మధుసూదన రావు గురువారం తెలిపారు. అక్టోబర్ 29వతేదీ నుంచి నవంబరు 4వతేదీ వరకు గోవా రాష్ట్రంలోని పన్‌జిమ్ అక్వాటిక్ సెంటర్‌లో జరగనున్న జాతీయస్థాయి పోటీలలో జగదీష్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తాడని తెలిపారు. కళాశాల పాలకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు అధ్యాపకులు అభినందించారు.

ఏరియా వైద్యశాలకు ల్యాబ్ మిషనరీ అందజేత



సత్తెనపల్లి: పట్టణంలోని ఏరియా వైద్యశాల ల్యాబ్‌లో అవసరమైన సెంటర్ఫ్యూగ్ అనే రూ. 22 వేలు విలువ చేసే పరికరాన్ని హాస్పిటల్ అభివృద్ధి కమిటీ డైరెక్టర్ కొత్తా రామకృష్ణ గురువారం వైద్యశాలకు అందించారు. రోగులకు సకాలంలో ల్యాబ్ టెస్టులు చేయాలంటే ఇప్పుడున్న ఒక పరికరం సరిపోవడం లేదని ల్యాబ్ ఉద్యోగులు తన దృష్టికి తీసుకు రావడంతో వెంటనే స్పందించి ఎస్‌కే ఫిట్నెస్ జిమ్ వారిని సంప్రదించగా కొంత మొత్తం అందించారని మిగిలిన నగదు తాను వేసుకున్నట్లు తెలిపారు. వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ బి. లక్ష్మణరావు, నాగు, కిరణ్, వైద్యశాల ల్యాబ్ సిబ్బంది అలీ, రామకృష్ణ, చందు ఉన్నారు.

ఘనంగా మిలాద్ ఉన్ నబీ వేడుకలు



పసుమర్రులో చినమసీదు వీధిలో ప్రార్థనలకు హాజరైన ముస్లిం కుటుంబాలు

చిలకలూరిపేటటౌన్: మండలంలోని పసుమర్రు గ్రామం చిన మసీదు వీధిలో గురువారం మిలాద్ ఉన్ నబీ వేడుకల్ని స్థానిక ముస్లింలు భక్తి శ్రద్ధలతో చేశారు. గత ఐదేళ్ల కాలంగా ప్రతి సంవత్సరం మిలాద్ ఉన్ నబీ రోజున వీధి ప్రజలంతా సమిష్టిగా ఈ వేడుకల్ని నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఉదయం నుంచి మొహమ్మద్ ప్రవక్త (సఅసం) స్మరిస్తూ ఆధ్యా త్మిక గీతాలను ఆలపిస్తారు. అనంతరం భారీగా అన్నదాన కార్యక్రమం చేస్తారు. ఆయా కార్యక్రమాలను అక్కడి పెద్దలు షేక్ మస్తాన్ షరీఫ్-నసీమా, అబ్దుల్ రాఫ్-గౌసియా, అబ్దుల్ రవూఫ్-మెహెర్, ఫర్మానుల్లా- సానియా, అమానుల్లా - సఫూర దంపతుల ఆధ్వర్యంలో ఆయా కార్యక్రమాల్ని నిర్వహించారు.

వినుకొండలో..

వినుకొండ(నూజెండ్ల): ప్రపంచ మానవాళికి ఆదర్శమైన జీవితాన్ని ప్రసాదించిన దైవమూర్తి మహమ్మద్ ప్రవక్త అని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. గురువారం మిలాద్ ఉన్ నబి పర్వదినం సందర్భంగా ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. మహమ్మద్ ప్రవక్త బోధనలతో మానవాళికి ఆదర్శ ధార్మిక జీవితాన్ని ప్రసాదించారని ఆయన కొనియాడారు.

నాదెండ్లలో...

నాదెండ్ల: సమాజంలో దురాచారాలను పెకళించి, సమస్త మానవాళిని సన్మార్గం వైపు నడిపిన మహమ్మద్ ప్రవక్త బోధనలు సర్వ మానవులకు ఆచరణీయమని మౌలానా అబ్దుల్ రహమాన్ చెప్పారు. మహమ్మద్ ప్రవక్త జయంతిని పురస్కరించుకుని మీలాద్ ఉన్ నబి పర్వదినాన్ని ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అరేబియా దేశంలో 1400 ఏళ్ల క్రితం జన్మించిన మహమ్మద్ ప్రవక్త గొప్ప సంఘ సంస్కరణలు చేశారన్నారు. నాటి సమాజంలో దురాచారాలు, దౌర్జన్యాలను నిర్మూలించి సదాచారాలను నెలకొల్పారన్నారు. మనుషులంతా సమానమేనని, ఏ ఒక్కరిపై మరొకరికి ఏరకంగానూ ఆధిపత్యం లేదని, అందరి భగవంతుడు ఒక్కడేనని చాటారన్నారు.

రక్తదానం మరొకరికి ప్రాణదానం

నరసరావుపేట: రక్తదానం చేయడం వల్ల మరొకరి ప్రాణం కాపాడవచ్చని, ప్రతి ఒక్కరూ సాధ్యమైనంత వరకు రక్తదానం చేయాలని ఎస్ఎఫ్ఐ, డీవై ఎఫ్ఐ నాయకులు వెల్లడించారు. సర్దార్ భగత్‌సింగ్ 116వ జయంతి సందర్భంగా ఆర్టీసీ బస్టాండ్ వద్దనున్న సీఐటీయూ కార్యాలయంలో పల్నాడు బ్లడ్ సెంటర్ పర్యవేక్షణలో గురువారం రక్తదాన శిబి రం నిర్వహించారు. శిబిరాన్ని ప్రభుత్వ వైద్యులు డాక్టర్ పామరాజు వెంకటేశ్వర్లు, జిల్లా ఎస్ఎఫ్ఐ గౌరవాధ్యక్షుడు ఎ.లక్ష్మీశ్వర రెడ్డి ప్రారంభించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ షహీద్ భగత్‌సింగ్ చిన్న వయసులోనే భారతదేశం స్వతంత్రం కోసం పోరాడి ఉయ్యాల ఊగిన యువ నాయకుడని, నేటితరం విద్యార్థిని, విద్యార్థులు యువకులు కామ్రేడ్ భగత్‌సింగ్ ఆశయ సాధన కోసం ఆయన అడుగుజాడల్లో నడవాలని పేర్కొన్నారు. మరొకరి జీవితానికి వెలుగును ఇవ్వండి, రక్తదానం చేయండి, ప్రాణదాతలుకండి.. అంటూ పలు నినాదాలు చేశారు. శిబిరంలో విద్యార్థి, యువజన సంఘాలు, ప్రజా సంఘాలు, వామపక్ష నాయకులు, ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ, సీఐటీయూ నాయకులు రక్తదానం చేశారు. జిల్లా సీఐటీయూ సహాయ కార్యదర్శి సిలార్ మసూద్, సమైక్యా ఆంధ్రప్రదేశ్ ముస్లిం జేఏసీ రాష్ట్ర కన్వీనర్ ఎస్‌కే జిలాని మాలిక్, డీవైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆంజనేయ రాజు, డీవైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి జడ రాజ్‌కుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి సిద్ధూ, పల్నాడు బ్లడ్ బ్యాంక్ టెక్నీషియన్ ఎం.శ్రీనివాస్, జిల్లా డీవైఎఫ్ఐ నాయకులు షేక్ సుభాని, ఎస్ఎఫ్ఐ చిలకలూరిపేట డివిజన్ ప్రెసిడెంట్ జి.రాజేష్, విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కళాశాల అభ్యున్నతికి పూర్వ విద్యార్థుల విరాళం

వినుకొండ (నూజెండ్ల): పట్టణంలోని గంగినేని కల్యాణ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధికి 1993-96 విద్యా సంవత్సరం చదివిన పూర్వ విద్యార్థులు రూ. లక్ష రూపాయల విరాళాన్ని కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శ్రీహరిబాబు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ తాము చదువుకున్న కళాశాల అభివృద్ధికి తమవంతు సహకారం అందించటం చాలా సంతోషంగా ఉందన్నా రు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఎం. భాస్కరరెడ్డి, ఆంజనేయులు, పి.రమేష్, జె.రమేష్, మధుమోహన్, శివనాగరాజు, వెంకటరెడ్డి, పి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఘనంగా వినాయక నిమజ్జనం



నిమజ్జనానికి తరలి వెళ్తున్న గణనాథుడు



చిన్నారుల కోలాటంతో బుజ్జి రథాలపై గ్రామోత్సవం

వెల్దుర్తి: మండలంలోని గుండ్లపాడు గ్రామంలో ఊరకుంట సెంటర్‌లో ఏర్పాటు చేసిన వినాయక నిమజ్జన కార్యక్రమం గురువారం ఘనంగా నిర్వహించారు. వినాయక విగ్రహం వద్ద లడ్డూకు వేలం పాట నిర్వహించగా తోటా శ్రీనివాసరావు రూ.51,000లకు దక్కించుకున్నారు. ఈ సందర్భంగా పులిహోర పంపిణీ చేశారు. స్వామి వారి నిమజ్జన కార్యక్రమంలో డీజేతో యువకులు, మహిళలు నృత్య ప్రదర్శన చేస్తూ సంతోషంగా సమీపంలోని కృష్ణానదిలో నిమజ్జనం చేశారు.

వైభవంగా బుజ్జి గణేషుని నిమజ్జన ఉత్సవం

కారెంపూడి: వినాయక నిమజ్జన ఉత్సవాన్ని కారెంపూడిలో రజక సంఘం ఆధ్వర్యంలో గురువారం వైభవంగా నిర్వహించారు. వారితో పాటు చిన్నారులు నాలుగు చిన్న రథాలను తయారు చేయించి వాటిపై వివిధ రకాల కారు బొమ్మ లుంచి వాటిపై వినాయకుని బొమ్మలుంచి చూడ చక్కగా ఊరేగింపు నిర్వహించారు. చిన్నారులు కోలాటం ఆడుతూ అంకాలమ్మ గుడి మీదగా బస్టాండ్ సెంటర్ వరకు గణేష్ ఊరేగింపు వైభవంగా నిర్వహించారు. ప్రసాదాలు పంచుతూ చిన్నారులు కోలాటం ఆడుతూ ఎలాంటి ఆర్భాటాలు లేకుండా భక్తి ప్రపత్తులతో వినాయకుని స్తుతిస్తూ గణేష్ గ్రామోత్సవం కొనసాగింది.

టౌన్ అధ్యక్షుడు అనిల్‌కుమార్‌కు సన్మానం



దాచేపల్లి : వైఎస్సార్ సీపీ యువజన విభాగం పట్టణ అధ్యక్షుడిగా నియమితులైన ఇరికేపల్లికి చెందిన నాగెండ్ల అనిల్‌కుమార్‌ను గురువారం సన్మానించారు. ఇరికేపల్లిలోని తెలుగు బాప్టిస్ట్ చర్చి ప్రాంగణంలో అనిల్‌కుమార్‌ను శాలువాతో సన్మానించి అభినందించారు. పార్టీని బలోపేతం చేసేందుకు కష్టపడి పనిచేయాలని నేతలు అనిల్‌కుమార్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్మన్ కొప్పుల సాంబయ్య, మాజీ సర్పంచ్‌లు మందపాటి రమేష్‌రెడ్డి, బుర్రి విజయ్‌కుమార్‌రెడ్డి, జెడ్పీటీసీ మూలగొండ్ల ప్రకాష్‌రెడ్డి, వైస్ చైర్మన్ షేక్ ఖాదర్‌భాషా, కౌన్సిలర్లు మందపాటి వీరారెడ్డి, ఈదా వెంకటరెడ్డి, చాట్ల క్రాంతికుమార్, మానిటరింగ్ కమిటీ సభ్యుడు గద్దల వేదమణి, కాలనీవాసులు నాగెండ్ల రత్నం, మాతంగి రాంబాబు, నాగెండ్ల పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.